

ఎనిమిది మంది ఎస్సైల బదిలీలు

కరీంనగర్ క్రైం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 8 మంది ఎస్సైల బదిలీ ఉత్తర్వులు గురువారం ఐజీ కార్యాలయం నుంచి వెలువడ్డాయి. గన్నేరువరంలో పనిచేస్తున్న టి.నరేష్‌ను వెకెన్సీ రిజర్వు(వీఆర్)కు, వీఆర్‌లో ఉన్న జి.నరేందర్‌రెడ్డిని గన్నేరువరం ఎస్సైగా బదిలీ చేశారు. ఎల్‌ఎండీ ఎస్‌ఐ టి వివేక్‌ను వీఆర్‌కు, సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట ఎస్‌ఐ శ్రీకాంత్‌ను ఎల్‌ఎండీ ఎస్‌ఐగా, చొప్పదండి ఎస్‌ఐ ఎం సురేందర్‌ను వీఆర్‌కు, కరీంనగర్ సీసీఆర్‌బీలో ఎస్‌ఐ నరేష్‌రెడ్డిని చొప్పదండి ఎస్‌ఐగా, వీణవంక ఎస్‌ఐ టి తిరుపతిని వీఆర్‌కు, కరీంనగర్ సీటీసీలో పనిచేస్తున్న ఏ తిరుపతిని వీణవంక ఎస్సైగా బదిలీ చేశారు.



లంచావతారులపై ఏసీబీ కొరడా

- అరున్నరేళ్లలో 78 కేసులు, 116 మంది అరెస్టు
- ప్రభుత్వశాఖల్లో తీవ్రస్థాయిలో అవినీతి

కరీంనగర్ క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వ కార్యాలయంలో చూసినా లంచం ముట్టజెప్పనిదే ఏ పని కాదు. ప్రభుత్వ ఉద్యోగులు విధిగా చేయాల్సిన పనులను ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తూ ప్రజల నుంచి లంచం డబ్బులు వసూలు చేస్తున్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగే బదులు ఎంతో కొంత ముట్టజెప్పి పని పూర్తి చేయించుకోవడం సాధారణంగా మారింది. లంచం ఇవ్వకపోతే సంబంధిత ఫైల్ బీరువాలోనే దుమ్ముపట్టిపోతుంది. లంచాల బాధ భరించలేని కొందరు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు.

ఇటువంటి సందర్భాలలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా లంచావతారులను పట్టుకుని కటకటాల్లోకి నెట్టుతున్నారు. కరీంనగర్ రీజియన్‌లో 2019 నుంచి ఇప్పటి 2025 జూన్ 4వ తేదీ వరకు లంచాలు తీసుకున్న సంఘటనల్లో 78 కేసులు నమోదు చేసి 116 మంది ఉద్యోగులు, మధ్యవర్తులను అరెస్టు చేశారు. ఇందులో 35 మంది రెవెన్యూ ఉద్యోగులు, 13 మంది పోలీసులు ఉన్నారు.

అమలుకాని సిటిజన్ చార్ట్

ప్రభుత్వ కార్యాలయాల్లో ఒక పని పూర్తి చేయటానికి ప్రభుత్వం నిర్దిష్టమైన కాలాన్ని నిర్ణయించింది. దీనినే సిటిజన్ చార్ట్ అంటారు. ఏ కార్యాలయంలోనూ సిటిజన్ చార్ట్ బోర్డు కనపడదు. ఎక్కడో ఒక కార్యాలయంలో బోర్డు కనిపించినా అది అములకు నోచుకోదు. దానిని పర్యవేక్షించే అధికారులే లేకుండా పోయారు. బాధిత ప్రజలు నిలదీస్తే వారిపనులకు, సమస్యల పరిష్కారంకు కొర్రీలు పెడుతూ పెండింగ్‌లో పెట్టి వేధిస్తున్నారు. ఇటువంటి వేధింపులకు గురైన బాధితులు చివరకు అవినీతి నిరోధకశాఖను ఆశ్రయిస్తున్నారు.

ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064...

అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సమాచారాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేసి చెప్పవచ్చు. ఏసీబీ వాట్సప్ నంబర్ 9440446106, ఫేస్ బుక్ (తెలంగాణ ఏసీబీ), ట్విట్టర్ (ఎక్స్) తెలంగాణ ఏసీబీకి సమాచారం అందించవచ్చు. సమాచారం అందించినవారు పేర్లను గోప్యంగా ఉంచుతారు.

కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది లంచాల తీసుకునే సమయంలో ఏసీబీకి చిక్కకుండా కొత్తదారులు వెదుకుతున్నారు. కొందరు ఉద్యోగులు ప్రత్యేకంగా ఏజెంట్లను నియమించుకుంటున్నారు. మరి కొందరు దళారులతో బేరసారాలు సాగిస్తూ వారి ద్వారానే లంచాలు స్వీకరిస్తున్నారు. ఇటీవల ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఒక కాంట్రాక్టర్ వద్ద 60 వేల రూపాయలు తీసుకుంటుండగా ఏసీబీ పోలీసులు పట్టుకున్నారు. అయన డబ్బులను నేరుగా తీసుకోకుండా ఇంటి బయట అరుగుపై పెట్టమన్నాడు. ఆ తరువాత ఆ డబ్బులను చేతితో ముట్టకుండా ఒక టీ షర్ట్, మరొక బట్ట, మరొక కవర్‌లో పెట్టి ఇంటి బయట ముళ్లపొదల్లో పారేశాడు.

ఏసీబీకి చిక్కకుండా కొత్తదారులు...

ఏసీబీ అధికారులు ఎవరూ లేరని నిర్ధారించుకున్న తరువాతనే ఆ డబ్బులను అర్ధరాత్రి లేదా మరుసటి రోజు ఉదయం తీసుకోవాల నుకున్నాడు. అక్కడే మఫ్టీలో మకాం వేసిన ఏసీబీ పోలీసులకు లంచం డబ్బులు ముట్టినట్లు సమాచారం రాగానే సోదాలు చేశారు. వారికి ఎటు వంటి డబ్బులు లభించలేదు. సీసీ కెమెరాలలో పరిశీలించగా అసలు విషయం తెలిసింది. దీంతో సదరు అధికారిని ప్రశ్నించగా లంచం తీసుకున్నానని ఒప్పు కోవడంతో అరెస్టు చేశారు. కొంతకాలం క్రితం మరో ఘటనలో ఏసీబీ అధికారులను చూసి ఒక ఉద్యోగి లంచం డబ్బులను టాయిలెట్‌లో వేశాడు. ఇంకో కేసులో నోట్లను నమిలి మింగాడు. లంచం తీసుకునేందుకు సహాయం చేస్తున్న దళారులు, ఏజెంట్లు, సహాయకులు, కిందిస్థాయి ఉద్యోగులపై ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేసి కటకటాల్లోకి నెడుతున్నారు.

2019 నుంచి ఏసీబీకి చిక్కిన ఉద్యోగులు

సంవత్సరం	కేసులు	ఉద్యోగులు
2019	17	25
2020	7	11
2021	9	15
2022	13	17
2023	8	11
2024	11	17
2025	13	20
(జూన్ 4 వరకు)		
	78	116



ముందస్తుగా మురిపించి.. ముఖం చాటేసి

- మండుతున్న ఎండలు, ఉక్కపోత
- వర్షాలకు మరో వారం రోజుల సమయం : వాతావరణశాఖ
- మృగశిర కార్తెపైనే రైతుల ఆశలు



కరీంనగర్ అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ముందుగానే ప్రవేశించటంతో రైతులు మురిసిపోయారు. ఒక్క సారిగా రుతుపవనాలు నెమ్మదించటంతో వేసవి వాతావరణంతో ప్రజలు అల్లాడుతున్నారు. వారం నుంచి పగటిపూట ఎండ తీవ్రంగా ఉండగా, సాయంత్రం, రాత్రి సమయాల్లో అక్కడక్కడ ఈదురు గాలులతో పాటు చిరు జల్లులు పడటంతో వాతావరణ పరిస్థితుల్లో అనిశ్చితి నెలకొంది. రోహిణికార్తె మే 25న ప్రారంభమైంది. ఈ కార్తెలో సాధారణంగా తీవ్రంగా ఎండలుంటాయి. 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ రుతుపవనాల ప్రభావంతో వారం రోజులు వాతావరణం చల్లబడి వర్షాలు కురిశాయి. ఎండ, ఉక్కపోత బారినుంచి తప్పించుకున్నామని ప్రజలు ఆనందపడ్డారు. అంతలోనే మళ్లీ ఎండలు తీవ్రమయ్యాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు 38 నుంచి 40 డిగ్రీలకు చేరుకో వటంతో పగటి పూట ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. గురువారం 38.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ నెల 10వ తేదీ తరువాతనే రాష్ట్రంలో రుతుపవనాల్లో మళ్లీ కదలిక వచ్చే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్నది.

దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు :

ముందస్తు వర్షాలతో చాలా మంది రైతులు ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు నాటేందుకు సిద్ధమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో విత్తనాలు కూడా నాటారు. వర్షాలు లేక పోవటంతో అవి మొలకెత్తలేదు. కొందరు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. జూన్ రెండో వారం వరకు నైరుతి రుతుపవనాలు పుంజుకుని విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తుండగా రైతులు కూడా ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ నెల 10 నుంచి మృగశిర కార్తె ప్రవేశిస్తుండటంతో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని రైతులు ఆశతో ఉన్నారు. మృగ శిరకార్తెలో వర్షాలు కురిసిన తర్వాతే రైతులు పత్తి, మక్క, ఇతర విత్తనాలు నాటేందుకు సిద్ధమయ్యారు. కొన్ని ప్రాంతాల్లోని నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు.

డివిజన్ల పునర్విభజనపై అభ్యంతరాలు

కరీంనగర్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డివిజన్ల పునర్విభజనపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ శుక్రవారం 16 దరఖాస్తులు అందినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. డివిజన్ల పునర్విభజనపై అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 11 వరకు గడువు ఉండగా, మొదటి రోజే 16 మంది అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ దరఖాస్తులు సమర్పించారు.

దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పమేలా సత్పతి



చెంజర్లలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : భూభారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మండలంలోని చెంజర్ల గ్రామంలో గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే భూభారతి చట్టాన్ని రాష్ట్రప్రభుత్వం తీసుకవచ్చినట్లు తెలిపారు. రైతుల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తును విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. సదస్సులో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామానికి చెందిన ఓ రైతు భూ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ హెల్ప్‌డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, తహసీల్దార్ విజయ్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

దక్షిణాదిపై మోదీ ప్రభుత్వం చిన్న చూపు

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో మోదీ ప్రభుత్వం దక్షిణాదిపై చిన్నచూపు చూస్తున్నదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ ఉత్తరాది రాష్ట్రాల సీట్లు పెంచుకునేందుకు కులగణన చేపడుతున్నారన్నారు. నియంతృత్వ పోకడతో ఉత్తరాది రాష్ట్రాలకు పెద్ద పీట వేస్తూ దక్షిణాది రాష్ట్రాలపై చిన్న చూపు చూస్తోందన్నారు. ఉత్తరాది రాష్ట్రాల సీట్లు పెంచుకునేందుకే కులగణన చేపడుతున్నారన్నారు. పాకిస్తాన్ ఉగ్రవా దులపై ఆపరేషన్ సిందూర్ పేరుతో యుద్ధం చేసి చర్చలు జరిపారన్నారు, కానీ మావోయిస్టులతో చర్చలు జరిపి పరిష్కరించడం లేదన్నారు. మావోయిస్టులను అంతం చేయాలని మోదీ, అమిత్‌షా కంకణం కట్టుకున్నారన్నారు. ప్రశ్నించే గొంతు ఉండకూ డదని ప్రజాస్వామ్యంపై కేంద్రం ప్రభుత్వం దాడి చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలను జాప్యం చేయకుండా వెంటనే నిర్వహించి గ్రామ పంచాయతీ పెండింగ్ నిధులు విడుదల చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పైడిపల్లి రాజు, బండ రాజిరెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి





లలితాపూర్‌లో మొక్కను నాటుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, ఎల్‌ఎండీలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేష్

మానకొండూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మండలంలోని లలితాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి హానికరమని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని కోరారు. పంట చేతికి వచ్చిన తర్వాత వ్యర్థాలను కాల్చకుండా భూమిలోనే కలియ దున్నాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ఏఎంసీ ఛైర్మన్ మర్రి ఓదెలు, యునిసెఫ్ ప్రతినిధి కిషన్‌స్వామి, ఎంపీడీవో వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మండలంలోని వన్నారంలో రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించి ప్రధాన రోడ్డు వెంట మొక్కలు నాటారు.

- **తిమ్మాపూర్** : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సీనియర్ సివిల్ జడ్జి కే. వెంకటేష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని ఎల్‌ఎండి కాలనీలో గల దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో సివిల్ జడ్జి కె.వెంకటేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ, గృహ హింస, మోటారు వాహనాల చట్టాలపై అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్య దర్శితో పాటు మహిళా శిశువికాస కేంద్రం జిల్లా మేనేజర్ వి.సు ధారాణి, లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను పరిశీలించిన అదనపు కలెక్టర్

కరీంనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను గురువారం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాంను తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రతినిధులు మడుపు మోహన్, సత్తినేని శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్, బర్కత్ అలీ, కళ్యాడపు ఆగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బాలభవన్ చిన్నారుల ప్రదర్శన

- ముగిసిన వేసవి శిక్షణ శిబిరం
- హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్ కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్, విద్యాశాఖ సహకారంతో ఏప్రిల్ 24 నుంచి 10 అంశాల్లో జరిగిన వేసవి శిక్షణ శిబిరం గురువారంతో అట్టహాసంగా ముగిసింది. ఈ సందర్భంగా బాలభవన్ చిన్నారుల ప్రదర్శన ఆకట్టుకుంది. కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా కలెక్టర్ పమేలాసత్పతి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అతిథులుగా అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఈఓ శ్రీరాం మొండయ్య, డీవై ఎస్‌ఓ శ్రీనివాస్ హాజరయ్యారు. అధ్యక్షత వహించిన బాలభవన్ సూప రింటెండెంట్ కట్ట మంజులాదేవి మాట్లాడుతూ వేసవిలోనే కాకుండా సంవత్స రమంతా ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు 5 అంశాల్లో శిక్షణ ఇస్తున్నామని, దీన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఈ యేడు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 1000 మంది విద్యార్థులు 10 అంశాల్లో శిక్షణ పొందారని తెలిపారు. అంబేద్కర్ స్టేడియంలోని బాలభవన్‌ను పూర్తిగా ఆధునికీకరించేందుకు సహకరించిన కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, డీఈఓలకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు అబాకస్, కర్రసాము, శాస్త్రీయ నృత్యం, యోగా, చెస్, మృదంగం, జానపద నృత్యం అంశాల్లో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డ్రాయింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ షీట్లను ప్రదర్శించారు. కార్యక్ర మంలో శిక్షకులు రాధిక, రాజేందర్, మల్లిక, అనూప్, శ్రీధర్, సగెం రాధాకృష్ణ, సూర్యశ్రీ, కృష్ణకుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి, పాల్గొన్న అధికారులు



విద్యార్థులు, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

మానసిక వేదనతో వృద్ధుడి బలవన్మరణం

గన్నేరువరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఒంటరిగా జీవించలేక మానసికవేదనకు గురైన ఓవృద్ధుడు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికిచెందిన తాళ్లపల్లి పరశురాములు(80) వృద్ధాప్యంలో ఒంటరితనంతో జీవించలేక మానసికంగా విసిగిపోయి గురువారం ఉదయం తన ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఐదేండ్ల క్రితం మృతిచెందగా వీరికి ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు. అందరికీ పెళ్లిళ్ల అయ్యాయి. కుమారుడు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. మృతుడి కోడలు అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మతిస్థిమితం సరిగా లేక తండ్రిని చంపిన తనయుడు

రాయికల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో మానసిక స్థితి సరిగా లేక తొట్లె ఎర్రయ్య (65) అనే వ్యక్తిని కన్న కొడుకు మల్లేష్ గొడ్డలితో గురువారం దాడిచేసి హతమార్చాడు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. ఎర్రయ్య కొడుకు మల్లేష్‌కు కొన్నేళ్లుగా మానసిక పరిస్థితి సరిగాలేదు. చిన్నప్పుడేతల్లి కూడా మరణించడంతో మల్లేష్ ఆలనాపాలనా ఎర్రయ్యనే చూసుకుంటున్నాడు. మానసిక స్థితి సరిగాలేక మల్లేష్ తరచూ తనతండ్రి ఎర్రయ్యతో గొడవ పడుతుండేవాడు. ఎర్రయ్య స్థానికంగా కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం ఇంటికి వచ్చిన ఎర్రయ్యతో మల్లేష్ గొడవపడి గొడ్డలితో దాడిచేయగా తలకు, కాళ్లకు తీవ్రగాయాలై మరణించాడు. కులపెద్దమనిషి నాగుల గంగమల్లయ్య ఫిర్యాదు మేరకు రాయికల్ ఎస్సై సుధీర్‌రావు కేసు నమోదు చేశాడు. జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామానికిచెందిన బూర్ల జనార్దన్(45) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబసభ్యులు ఎన్నిసార్లు చెప్పినా మానలేదు. బుధవారం సాయంత్రం జనార్దన్ అతిగామద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్య ఉమతో మద్యం ఎందుకు తాగుతున్నావని మందలించింది. ఆమెపై చేయి చేసుకోవడంతో అదే గ్రామంలోని తల్లి దగ్గరికి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి ఎంత పిలిచినా తలుపు తీయకపోవడంతో కిటికీ నుంచి చూసేసరికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య జయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి



ప్రవీణ్(ఫైల్)

మల్లాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం రాఘవు పేట గ్రామంలో గురువారం ట్రాక్టర్ బోల్తా పడి చెదలు ప్రవీణ్(30) అనే రైతు మృతిచెందగా అతడి కుమారుడికి గాయాలయ్యాయి. ప్రవీణ్ ట్రాక్టర్‌తో తనభూమిని దున్ని పెద్ద కుమారుడు శ్రీహన్(10)ను కూర్చోబెట్టుకొని బయటకు వస్తుండగా ట్రాక్టర్ బోల్తాపడింది. ఆ సంఘటనలో కుమారుడు శ్రీహన్ పక్కకు పడిపోయాడు. ప్రవీణ్ ట్రాక్టర్ కిందే ఉండిపోయాడు. పొలం సమీపంలో గల రైతులు సహాయక చర్యలు చేపట్టగా ప్రవీణ్ అప్పటికే చనిపోయాడు. కుమారుడిని చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



నాగరాజు(ఫైల్)

మల్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం నూకపల్లి డబుల్‌బెడ్ రూం ఇళ్లలో నివాసముండే క్షీరసాగరం నాగరాజు(39) అనేవ్యక్తి అప్పుల బాధతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నాగరాజుకు నాలుగు లక్షల రూపాయల అప్పు అయింది. బుధవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన నాగరాజు సమీపంలోగల బైపాస్ దారి పక్క బావిలోదూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పు ఇచ్చిన వారు తన కుటుంబసభ్యులను ఇబ్బంది పెట్టవద్దని మృతుడు ఓ చీటీ రాసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రయాణికులకు తప్పని తిప్పలు

- మెట్‌పల్లి బస్టాండ్‌లో అసౌకర్యాలు
- సరిపడా ప్లాట్‌ఫాంలు లేక ఇబ్బందులు
- నిత్యం 50 వేల మంది రాకపోకలు
- వసతులు కల్పించాలంటున్న ప్రయాణికులు



మెట్‌పల్లి బస్టాండ్

మెట్‌పల్లిటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. ప్రయాణికులకు సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నిత్యం 50 వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి నెలా లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికీ ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు సరైన సౌకర్యాలు కల్పించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ప్రయాణికులు కూర్చోవడానికి సరైన ప్లాట్‌ఫాంలు లేవు. మెట్‌పల్లి బస్టాండ్ నుంచి నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు ఇక్కడి నుంచి నిత్యం 50 వేల మంది ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తుంటారు.

డిపో పరిధిలో మొత్తం 50 బస్సులు ఉండగా వివిధ ప్రాంతాల నుంచి వందలో సంఖ్యలో బస్సులు మెట్‌పల్లి బస్టాండ్‌కు వస్తుంటాయి. ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, రైతులు పెద్ద సంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తుంటారు.

అసౌకర్యం.. అపరిశుభ్రత

బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు కూర్చునేందుకు వసతితో పాటు, మంచినీరు, సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో నిర్మించిన మూత్రశాలలు నిరుపయోగంగా ఉన్నాయి. మహిళలకు సరిపడా మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్న మూత్రశాలలు పరిశుభ్రంగా లేవని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్టాండ్ ఆవరణలో చెత్తచెదారంతో పాటు మురికినీరు నిలుస్తోంది. ఇప్పుడే ఇలా ఉంటే వర్షాలు పడితే పరిస్థితి మరింత అధ్వానంగా మారే అవకాశం ఉంది. వేల సంఖ్యలో రాకపోకలు సాగించే బస్టాండ్‌లో కేవలం 5 ప్లాట్‌ఫాంలు మాత్రమే ఉండటంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం అయితే రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాట్ ఫాంల సంఖ్యతో పాటు బస్టాండ్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్లాట్‌ఫాంల సంఖ్య పెంచుతాం

దేవరాజ్, డిపో మేనేజర్, మెట్‌పల్లి

ప్రయాణికుల రద్దీతో బస్టాండ్‌లో సౌకర్యాలు, ప్లాట్ ఫాంల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే ప్లాట్ ఫాంల సంఖ్య పెంచుతాం. బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తాం.





నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలు, అపరిశుభ్రంగా ఉన్న బస్టాండ్ ఆవరణ, ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్టాండ్

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- కరీంనగర్ సీపీ గౌస్ ఆలం

చిగురుమామిడి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు, క్రీడల్లో రాణించాలని కరీంనగర్ సీపీ గౌస్ ఆలం అన్నారు. ఈ నెల 12నుంచి 15వరకు డెహ్రాడూన్‌లో జరిగే జాతీయస్థాయి కరాటేపోటీలకు ఎంపికైన ఎ సాయిమిథన్‌రెడ్డిని గురువారం కరీంనగర్ సీపీ గౌస్ ఆలం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నవయస్సులో జాతీయస్థాయిలో పాల్గొనే అవకాశం రావడం సంతోషమన్నారు. కార్యక్రమంలో జపాన్ కరాటే అసోషియేషన్ ఇండియాన్ షాటోకాన్ కరాటే రాష్ట్ర అర్గనైజింగ్ కార్యదర్శి డాక్టరు బొల్లి ఐలయ్య, కోశాధికారి బండారిపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలు

ఓదెల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి 29వ రైల్వే గేట్ వద్ద దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌నుంచి పడి గోదావరిఖనికి చెందిన కంకనాల సంతోష్ అనే యువకుడు తీవ్రగాయాలపాలయ్యాడు. సికింద్రాబాద్ నుంచి రామగుండంకు దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తుండగా డోర్ వద్ద ఉన్న సంతోష్ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్న సంతోష్‌ను పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ సూచనల మేరకు బ్లూకోట్ సిబ్బంది శంకర్, శివశంకర్‌లు సంఘటన స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మట్టిని తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని ఆర్‌ఐ శ్రవణ్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం పట్టుకున్నారు. వాహనాలను తహసీల్ కార్యాలయానికి తరలించారు. వెంకటాపూర్ నుంచి అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్నారనే సమాచారంతో కాపు కాచి పట్టుకున్నామని ఆర్‌ఐ శ్రవణ్ పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

జగిత్యాల క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మేడిపల్లి మండలం కాసారం గ్రామానికి చెందిన బాలిక(17) బుధవారం జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ రహదారిలో అదృశ్యం అయ్యింది. బాలిక తన ఇంటి నుంచి బుధవారం జగిత్యాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. యువతితండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెద్దపల్లి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిపల్లికి చెందిన కుమ్మరి నర్సయ్య అనే రైతు గేదె విద్యుత్‌షాక్ గురై మృతి చెందింది. ఇంటి వద్ద గేదె కోసం ఏర్పాటు చేసిన షెడ్డు వద్ద ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్ సపోర్టు వైరుకు విద్యుత్ సరఫరా జరిగి గేదెకు తగిలి షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు. గేదె మృతి చెందడంతో సుమారు 80 వేలరూపాయల వరకు నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలో అధిష్టానాన్ని కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు



ఢిల్లీలో మల్లికార్జున ఖర్గేను కలిసి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలోని ఎమ్మెల్యేలు

తిమ్మాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు చోటు కల్పించాలని మాదిగ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలో ఎమ్మెల్యేలు మందుల సామెల్ (తుంగతుర్తి), అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (ధర్మపురి), తోట లక్ష్మీకాంత రావు(జుక్కల్), కలె యాదయ్య(చేవెళ్ల) ఢిల్లీలో అఖిలభారత కాంగ్రెస్‌కమిటీ జాతీయఅధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సంస్థాగత వ్యవహారాల ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను విడివిడిగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్ర మంత్రివర్గంలో ప్రస్తుతం ఖాళీగాఉన్న ఆరుస్థానాల్లో భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కసరత్తు చేపట్టారని, ఈమంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం కల్పించాలని కోరారు. జనాభా నిష్పత్తి ప్రకారమే కాకుండా సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకొని మాదిగలకు అవకాశం కల్పించాలని కోరారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మాదిగలు 33లక్షల మంది ఉన్నారని, తాజా లెక్కల ప్రకారం ఈ సంఖ్య రెట్టింపైన విషయాన్ని వారు గుర్తుచేశారు. ఈ లెక్కన మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరారు. మంత్రివర్గ విస్తరణలో తమకు న్యాయం జరుగుతుందని మాదిగలు ఆశలు పెట్టుకున్నారని, వారిఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా మంత్రివర్గంలో మాదిగలకు అవకాశం కల్పించేలా చూడాలని వారు కోరారు. మాకు మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూరుతుందన్నారు.

గోదావరిఖనిలో కారు బీభత్సం

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పాఠశాల గోడపైకి ఎక్కిన కారు
- ఒకరికి తీవ్రగాయాలు

కోల్‌సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పరశురాం నగర్‌లో గురువారం తెల్లవారుజామున కారు బీభత్సం సృష్టించింది. ప్రభుత్వ పాఠశాల వద్ద విద్యుత్ స్తంభానికి వేగంగా ఢీకొట్టడంతో స్తంభం విరిగింది. కారు వెనుక భాగం ప్రభుత్వ పాఠశాల గోడపైకి ఎక్కింది. ఘటనజరిగిన సమయంలో కారులో తిలక్‌నగర్ ప్రాంతా నికి చెందిన దార రోహిత్ అలియాస్ చింటు, అక్షయ్‌కుమార్ అనేఇద్దరు యువకులు ఉన్నారు. ఈఘటనలో దార రోహిత్‌కు గాయాలుకాగా లక్ష్మీనగర్‌లోని ఒకప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు. తిలక్‌నగర్‌కు చెందిన ప్రశాంత్ అనే ఫొటోగ్రాఫర్ వద్ద ఉన్న కారును బుధవారం అర్ధరాత్రి తరువాత ఇద్దరు యువకులు తీసుకుని వెళ్లారు. ఇతర స్నేహితులతో కలిసి మద్యంసేవించారు. తెల్లవారుజామున 4గంటలకు ఫైవింక్లయిన్ సెంటర్‌లో టిఫిన్‌చేసి కారులో పరశురాంనగర్‌వైపు వేగంగా వస్తుండగా అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టింది. భారీశబ్దంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. విద్యుత్‌వైర్లు తెగిపడ్డాయి. ఘటన జరిగిన సమయంలో అక్షయ్ కుమార్ కారు నడుపుతున్నట్టు తెలుస్తోంది. సేఫ్టీ బెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది.

తెల్లవారే దాకా ఇదే తంతు...

తిలక్‌నగర్ ప్రాంతంలో దూళ్‌పేటగా చెప్పుకునే సిక్ హాస్పిటల్ ఏరియాకు చెందిన కొందరు యువకులు అర్ధరాత్రి నుంచి తెల్లవారు వరకు చిత్తుగా మద్యం సేవించి గొడవలకు దిగుతున్నారు. గతంలో తెల్లవారే వరకు మద్యం సేవించిన ముగ్గురు యువకులు ఉదయం 4గంటలకు ఫైవింక్లయిన్ ఏరియాలో టిఫిన్ చేసేందుకు వెళ్లి అక్కడికి వచ్చిన మరికొందరితో గొడవపడి హత్యాయత్నం చేశారు. ఆ కేసులో దార రోహిత్‌కూడా నిందితుడే. మళ్లీ అదేయువకుడు కారు బీభత్సంలో ఉన్నాడు. ఈఘటనపై గురువారం సాయంత్రం వరకుఎవరూ ఫిర్యాదు చేయలేదు. సింగరేణి ఎలక్ట్రికల్ అధికారులు ఫిర్యాదు చేయాల్సి ఉండగా వెనుకాడుతున్నట్టు తెలుస్తోంది.

అట్రాసిటీ కేసుపై విచారణ

శంకరపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కరీంపేట గ్రామంలో ఎస్సీ సామాజికవర్గం వారిని అదేగ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు కులం పేరుతో దూషించారని మేరుగుశ్రీనివాస్ ఇతరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం హుజూరాబాద్ ఏసీపీ మాధవి విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 22న రాత్రి 9గంటల సమయంలో గడ్డం మల్లవ్వ అతని కుమారుడు గడ్డం రాజు ఇంటి నుంచి కేకలు, అరుపులు వినపడగా సమీపంలో ఉన్న మేరుగు శ్రీనివాస్‌తోపాటు కొంతమంది అక్కడికి వెళ్లి చూశారు. గడ్డం మల్లవ్వ అతని కుమారుడు రాజు, తన భార్య రేణుక(స్వప్న)ను కొడుతుండగా ఎందుకు కొడుతున్నారని శ్రీనివాస్‌తోపాటు మెరుగు తిరుపతి, బొజ్జ బిక్షపతి, స్వామి, నాగమ్మ మరికొంత మంది అడిగారు. మా కోడలును మేము ఏమైనా చేసుకుంటామని, మీకెందుకు అని ఇష్టం వచ్చినట్లు కులంపేరుతో దూషించినట్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఏసీపీ మాధవి ఇరువర్గాలను విచారించి, సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు.

అదుపు తప్పి ధాన్యం లారీ బోల్తా

మంథనిరూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్ సమీపంలో గాడుదులగండి గుట్ట మూల మలుపు వద్ద వడ్ల ధాన్యం లారీ అదుపుతప్పి లోయలో పడింది. గురువారం ఉదయం భూపాలపల్లి జిల్లా నుంచి సుల్తానాబాద్‌కు ధాన్యాన్ని తీసుకెళ్తున్న లారీ అదుపు తప్పడంతో గుట్టపైనుంచి లోయ పడిందని స్థానికులు తెలిపారు. లారీ లోయలో పడటంతో వడ్ల బస్తాలు చిందరవందరగా పడిపోయాయి. ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వృద్ధురాలిని తప్పించబోయి..

- బైక్‌పైకి దూసుకెళ్లిన లారీ
- దంపతుల దుర్మరణం
- గాయాలతో బయటపడిన చిన్నారి



చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి సహస్ర

సుల్తానాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. లారీ రూపంలోవచ్చిన మృత్యువు తల్లిదండ్రులను బలి తీసుకోగా మూడేళ్ల చిన్నారి గాయాలతో బయట పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌కు చెందిన గుంటిపల్లి రాములు (28) ఆయన భార్య అనూష (25)లు చిన్నారి సహస్ర(3)తో కలిసి సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో జరుగునున్న బంధువుల వివాహానికి హాజరుకావడానికి గురువారం రాత్రి బైక్‌పై బయలుదేరారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధి సుగ్లాంపల్లి స్టేజీ వద్ద రాజీవ్‌రహదారిపై నడుచుకుంటూ వస్తున్న వృద్ధురాలిని తప్పించే యత్నంలో లారీ డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న బైక్‌పై నుంచి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో అనూష అక్కడికక్కడే మృతిచెందగా ఆమెభర్త రాములుకు తీవ్ర గాయాల య్యా యి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్ కుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రు లను పోలీస్‌వాహనంలోనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రాములు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చిన్నారి సహస్ర స్వల్ప గాయాలతోచికిత్స పొందుతోంది. కాగా ప్రమాదం జరిగిన వెంటనేతాము 108అంబులెన్స్‌కు ఫోన్ చేశా మని, ఆలస్యంగావచ్చిందని గ్రామస్థులు ఆరోపించారు.

బసంత్‌నగర్‌లో విషాదం..

పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్‌నగర్ రాంనగర్‌లో నివాసముండె గుంటుపెల్లి రాములు, అనూషలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మూడేళ్ల చిన్నారి సహస్రతో కలిసి ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా సుగ్లాంపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. రాము 12 ఏళ్ల వయస్సులోనే తండ్రి కుమారస్వామి మృతి చెందాడు. తల్లి పద్మ పెంచి పెద్దచేసింది.. రాము లారీ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. కొడుకు అకాల మృతితో తల్లి పద్మ రోదనలు మిన్నంటాయి. అనూష స్వగ్రామం హుజూరాబాద్ మండలం అమ్మనగుర్తి.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు లారీలు..

- ఒకరి మృతి.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు



ఘటన స్థలం వద్ద సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు

హుజూరాబాద్‌రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లి గ్రామశివారులోని కాకతీయ కాలువ బ్రిడ్జివద్ద రెండులారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 7.30గంటల ప్రాంతంలో కరీంనగర్ వైపు నుంచి, అటు వరంగల్ వైపు నుంచి వస్తున్న రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లా టంగుటూరు గ్రామానికి చెందిన దాచేపల్లి కృష్ణకిషోర్(44) లారీక్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అతికష్టం మీద క్షతగాత్రుడికి బయటకితీసి చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించే లోపే మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాగా లారీక్లీనర్ మస్తాన్, మరో డ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా రెండులారీలు బ్రిడ్జిపై ఢీకొని ఉండటంతో అటు వరంగల్, ఇటు కరీంనగర్‌కు వెళ్లే వాహనదారులు తీవ్రఇబ్బందులు పడాల్సివచ్చింది. పోలీసులు వాహనాలను దారి మళ్లించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ఘట నపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన వొడితెల ప్రణవ్

ప్రమాదస్థలాన్ని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి వొడితెలప్రణవ్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను సీఐ కరుణాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. హైవేపై తరుచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని సీఐకి సూచించారు.

వివాహిత అదృశ్యం

- కేసు నమోదు

మెట్‌పల్లి రూరల్, జూన్, 5 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. వెల్లుల్ల గ్రామానికి చెందిన బోదాసు నళిని(21) అనే వివాహిత నిర్మల్ జిల్లా మామడ మండలం దిమ్మతుర్తి గ్రామానికి ఈనెల 4న ఉదయం వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తున్నానని ఖానాపూర్ బస్సు ఎక్కినట్లు తెలిపింది. సాయంత్రం గడిచినా ఇంటికి తిరిగి రాలేకపోవడంతో ఆమె కోసం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె అక్క బోదాసు మౌనిక ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెళ్లి బృందం వాహనాన్ని ఢీకొట్టిన డీసీఎం వ్యాన్

- నాలుగు నెలల బాబు దుర్మరణం
- పెళ్లి కొడుకుతో పాటు ఆరుగురికి గాయాలు



రుద్ర (ఫైల్)

మల్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా మల్యాల మండలం కొండగట్టు సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పెళ్లిబృందం ప్రయాణిస్తున్న కారును డీసీఎం వ్యాన్ ఢీకొట్ట డంతో నాలుగు నెలల బాబు వాగేరి రుద్ర మృతిచెందగా కారులోని పెళ్లి కొడుకు మహేశ్‌మెట్కర్‌తోపాటు మరో ఆరుగురికి గాయాలయ్యాయి. గురువారం ఉదయం జరిగే వివాహం కోసం మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి బయలుదేరిన పెళ్లి బృందం వాహనం మరో గంటన్నరలో పెళ్లి మండపానికి చేరుకునేలోపు ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా చిక్కలవాడీకి చెందిన హరి మెట్కర్ పెద్ద కుమారుడు మహేశ్‌మెట్కర్‌కు కరీంనగర్ జిల్లా హుజూ రాబాద్‌కు చెందిన ఓ యువతితో గురువారం వివాహం నిశ్చయం అయింది. నాందేడ్‌నుంచి కారులో పెళ్లికొడుకు, కుటుంబసభ్యులు, మరోవాహనంలో బంధువులు బుధవారం రాత్రి హుజూరాబాద్‌కు బయలుదేరారు. గురువారం వేకువజాము నాలుగు గంటల సమయంలో కొండగట్టు సమీపానికి చేరుకోగానే ఎదురుగా ఖమ్మం నుంచి మామిడి కాయల లోడ్‌తో వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. దీంతో కారు పూర్తిగా ధ్వంసం కాగాఅందులోని హరిమెట్కర్ మనవడు(కూతురి కుమారుడు) వాగేరి రుద్ర ముక్కులో నుంచి రక్తస్రావం అయి మృతిచెందాడు. ఈ ప్రమాదంలో పెళ్లి కొడుకుతోపాటు తండ్రి హరిమెట్కర్, కూతురు శీతల్, అల్లుడు దినేశ్, అన్న కూతుళ్ల లింగమ్మ, మరుబాయి, పొడే సోనాలి గాయపడగా చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన పెళ్లికొడుకు మహేశ్, అతని బావ దినేశ్‌ను మెరుగైన వైద్యంకోసం వారి స్వస్థలం నాందేడ్‌కు తీసుకెళ్లారు. హరిమెట్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా ఈ ప్రమాదంలో పెళ్లి కొడుకు మహేశ్ గాయపడడంతో గురువారం జరగాల్సిన వివాహం నిలిచిపోయినట్లు వరుడి కుటుంబసభ్యులు తెలిపారు.

ఆగిపోయిన పెళ్లి

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని ఇందిరానగర్‌లో ఓ యువతి పెళ్లి జరగాల్సి ఉండగా గురువారం నిలిచిపోయింది. నెలరోజుల క్రితం నాందేడ్‌కు చెందిన వరుడితో వివాహం నిశ్చయమైంది. వరుడు నాందేడ్ నుంచి కారులో వస్తుండగా, జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. దీంతో వివాహం ఆగిపోయింది.

మున్సిపల్ కార్యాలయంలో మహిళ హల్‌చల్

- ఇంటి నిర్మాణ అనుమతి ఇవ్వడం లేదని ఆగ్రహం
- టీపీఎస్ ఫిర్యాదుతో కేసు నమోదు

కరీంనగర్ అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తాను నిర్మించుకుంటున్న ఇంటికి మున్సిపల్‌కార్పొరేషన్‌లో దరఖాస్తు చేసినప్పటికీ అనుమతి ఇవ్వడం లేదంటూ కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన గంగాభవానిఅనే మహిళ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం టీపీవో ఉద్యోగులతో గొడవకు దిగింది. ఉద్యోగులపై ఆగ్రహంవ్యక్తం చేస్తూ బీరువా, కంప్యూటర్లను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించగా ఉద్యోగులు అడ్డుకున్నారు. గంగాభవాని ఇంటినిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోగా, ఆమె అత్తామామలు అనుమతి ఇవ్వవద్దని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదుచేశారు. దీనిపై టీపీవో అధికారులు విచారణ జరుపగా ఆస్థలం ప్రభుత్వ భూమిగా నిర్ధారణ అయింది. తహసీల్దార్ నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకురావాలని టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు గంగాభవానికి చెప్పారు. అయినప్పటికీ ఇంటి నిర్మాణపనులను గంగాభవాని ప్రారంభించడంతో టీపీవో అధికారులు నిర్మాణ సామగ్రిని స్వాధీనంచేసుకున్నారు. దీంతో ఆగ్రహించిన గంగాభవానీ ఉద్యోగులు లంచాలు తీసుకుని అనుమతి ఇవ్వకుండా తొక్కిపెడుతున్నారని దూషణకు దిగింది. ఆతర్వాత పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. గంగాభవాని మున్సిపల్ కార్యాయలంలోని దౌర్జన్యంగా ప్రవేశించి తమవిధులకు ఆటంకం కలిగించి ప్రభుత్వఆస్తిని ధ్వంసం చేసి, ప్రభుత్వఅధికారిని దూషించి, చంపుతానని, ఇంటి అనుమతి ఇవ్వకుంటే చనిపోతానని బెదిరించినట్లు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ దేవసాని సంధ్య కరీంనగర్ వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు గంగాభవానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం (ఫైల్)

ధాన్యం కొనుగోళ్లతో ఆర్థికాభివృద్ధి

- రూ. 39 లక్షలు ఆర్జించిన 12 సంఘాలు
- ఆదర్శంగా నిలుస్తున్న చొప్పదండి గ్రామైక్య సంఘాలు

వారంతా గ్రామాల్లో కూలి పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండే సామాన్య మహిళలు. కుటుంబమే లోకమని అనుకునే వారంతా సంఘంగా ఏర్పడ్డారు. మార్కెటింగ్ ఎలా చేయాలో తెలియదు. ప్రభుత్వ ప్రోత్సాహంతో కొనుగోళ్లపై అవగాహన పెంచుకున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రాణిస్తున్నారు. చొప్పదండి మండలంలో రబీలో 12 కేంద్రాల్లో లక్షకుపైగా క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసిన గ్రామైక్య సంఘాలు జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయి. దాదాపు 35 లక్షల రూపాయలను కమీషన్ రూపంలో మహిళా సంఘాలు ఆర్జించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘ మహిళల విజయగాథపై కథనం...

చొప్పదండి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో గత ఏప్రిల్‌లో 12 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. భూపాలపట్నం, చిట్యాలపల్లి, దేశాయిపేట, గుమ్లాపూర్, కాట్నపల్లి, కొలిమికుంట, కోనేరుపల్లి, మంగళపల్లి, పెద్దకుర్మపల్లి, రేవెల్లి, సాంబయ్యపల్లి, వెదురుగట్టులో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశారు. గ్రామైక్య సంఘాలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పగలు, రాత్రి కష్టపడి కేంద్రాలను నిర్వహించారు. రైతుల నుంచి లక్షకుపైగా క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించి సకాలంలో రైస్ మిల్లులకు తరలించారు. ఐకేపీ సిబ్బంది సంఘాలకు పూర్తి స్థాయిలో సహకారం అందించగా, సంఘాలు మరి కొంత మందికి ఉపాధి కల్పించారు.

1,21,895 క్వింటాళ్ల ధాన్యం సేకరణ

రబీ సీజన్‌లో 12 కొనుగోలు కేంద్రాల ద్వారా 1,21,895 క్వింటాళ్ల ధాన్యం రైతుల నుంచి సేకరించారు. గత ఖరీఫ్ కన్నా ఈ సారి అధికంగా కొనుగోలు చేశారు. పెద్ద కుర్మపల్లి కొనుగోలు కేంద్రంలో అత్యధికంగా 28,524 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. గుమ్లాపూర్‌లో 10,040 క్వింటాళ్లు, వెదురుగట్టులో 11,158 క్వింటాళ్ల ధాన్యాన్ని మహిళా సంఘాలు సేకరించారు. మహిళలు సేకరించిన ధాన్యానికి క్వింటాలుకు రూ. 32 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం కమీషన్ అందజేస్తుండగా, మండలంలో 12 సంఘాలు 39 లక్షల 640 రూపాయలను కమీషన్ రూపంలో ఆర్జించారు. పెద్దకుర్మపల్లి గ్రామైక్య సంఘం 9 లక్షల 12 వేల 768 రూపాయలను ఆర్జించింది.



సమర్థవంతంగా పనిచేశారు
నర్మద, ఐకేపీ ఏపీఎం, చొప్పదండి

ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మహిళా సంఘాలు సమర్థవంతంగా పనిచేశారు. మండల సంఘాలు జిల్లావ్యాప్తంగా మంచి పేరు సాధించాయి. ధాన్యం సేకరణతో సంఘాలు లక్షలాది రూపాయల ఆదాయాన్ని సమ కూర్చుకుంటున్నా యి. పురుషులకు ధీటుగా ధాన్యం కొనుగోళ్లలో మహిళలు రాణిస్తూ మన్ననలను పొందుతున్నారు.



అందరి సహకారంతో సాఫీగా కొనుగోళ్లు
ఉమ, గ్రామైక్య సంఘం కమిటీ మెంబర్, రేవెల్లి

అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యాపారులు అందరి సహకారంతో కొనుగోళ్లను సాఫీగా పూర్తి చేశాం. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని తూకం వేసి మిల్లులకు పంపించి, రైతులకు నగదు వచ్చే వరకు అప్రమత్తంగా ఉన్నాం. రైతులకు ఎలాంటి నష్టం, జాప్యం జరగకుండా పనిచేశాం. సంఘానికి ఆదాయంతో పాటు మంచి పేరు వచ్చింది.



చామనపల్లికి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు



అవార్డు అందుకుంటున్న చామనపల్లి గ్రామకార్యదర్శి కోరుకంటి మహేందర్ రావు

కరీంనగర్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని చామనపల్లి గ్రామ పంచాయతీకి రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు లభించింది. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దేవాదాయ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండాసురేఖ చేతుల మీదుగా పంచాయతీకార్యదర్శి కోరుకంటి మహేందర్‌రావు అవార్డును, ప్రశాంస పత్రాన్ని అందుకున్నారు. ఈ అవార్డుకు రాష్ట్రంలో 3గ్రామపంచాయతీలు ఎంపికవగా చామనపల్లి మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి జగన్మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె మహేందర్‌రావును, సిబ్బందిని మంత్రి అభినందించారు. చామనపల్లిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వచ్ఛదనం, పచ్చదనం సక్రమ నిర్వహణ, సెగ్రిగేషన్, కంపోస్టు ప్రిపరేషన్, విటమిన్ గార్డెన్, ప్లాస్టిక్ వ్యర్థల సక్రమ నిర్వహణ, ప్లాంటేషన్, నర్సరీ, కమ్యూనిటీ సోక్ పిట్స్ వంటిఅంశాల్లో చామనపల్లి అత్యుత్తమ తీరు కనబరిచింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌సెక్రెటరీ అహ్మద్ నదీమ్, టీఎస్‌పీసీబీ మెంబర్, సెక్రెటరీ రవి, చామనపల్లి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుడికి చిక్కిన 14కిలోల చేప



14 కిలోల చేపతో మత్స్యకారుడు నర్సింలు

గంభీరావుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులో 14కిలోల చేప చిక్కింది. గంభీరావుపేటకు చెందిన నర్సింలు అనే మత్స్యకారుడు గురువారం రోజులాగే మానేరులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. నర్సింలు వలకు 14 కిలోల చేప చిక్కింది. మండల కేంద్రంలోని చేపల మార్కెట్‌కు నర్సింలు చేపను తీసుకరాగా అందరూ ఆసక్తిగా తిలకించారు.

ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్



పొరండ్లలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

తిమ్మాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొరండ్లలో జిల్లాఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ, లోహియా ఎడిబిలయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారి ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వరిపంటకు ప్రత్యామ్నాయంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న ఆయిల్‌పామ్ పంట వేసుకోవాలని సూచించారు. ఒక టన్ను పామ్ ఆయిల్ గెలల ధర 20,058 రూపాయలు ఉందని, ఒక ఎకరానికి 10 టన్ను లదిగుబడి వస్తుందని, దీంతో సంవత్సరానికి లక్షకు పైగా ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ రైతు చాటీ రాజేశ్వర్‌రావు, బొమ్మిడి విజయ్‌కుమార్, ఉద్యాన వనాధికారి రవళి, లోహియా ఎడిబిల్ అయిల్స్ మేనేజర్ విజయభరత్, ఏఈఓ పూర్ణ చందర్, ఫీల్డ్‌ఆఫీసర్ రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు



ముస్తాబాద్‌లో అరెస్టును చూపుతున్న పోలీసులు

ముస్తాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మిస్సింగ్ కేసును పోలీసులు 24గంటల్లో ఛేదించారు. మండలంలోని గూడురుకు చెందిన జంపెల్లి మల్లయ్య(72) కనబడటం లేదని జంపెల్లి మల్లవ్వ ఫిర్యాదుచేసింది. కేసు నమోదు చేసుకొని ఎస్సై గణేశ్ దర్యాప్తును ప్రారంభించారు. సెల్‌ఫోన్‌ల సిగ్నల్ ఆధారంగా 24 గంటల్లో మిస్సింగ్ అయిన వ్యక్తిని కనుగొన్నారు. మల్లయ్యను విచారించగా ఈనెల 2వ తేదీన రాత్రి తన కుమారుడు పర్శరాములు డబ్బులు ఇవ్వడం లేదని కక్ష పెంచుకున్న బోయిన రాజేందర్,అతని స్నేహితుడు కలకోట రవి, నందినికారి సతీశ్ అనేకారు డ్రైవర్‌లు కిడ్నాప్‌చేసి కోరుట్లలోని ఒకరూంలో బంధించారని తెలిపారు. విచారణజరిపి బోయిన రాజేందర్, కలకోట రవి, సతీశ్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడదాం



జ్యూట్ బ్యాగులను ప్రదర్శిస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం అందరం పాటుపడుదామని, గాలి, నీరు, నేల ప్లాస్టిక్ సంచులతో కలుషితం కాకుండా క్లాత్ లేదా జనపనార సంచులను వాడుదామని మానేరు పర్యావరణ పరిక్షణసమితి అధ్యక్షుడు తోట లక్ష్మణరావు అన్నారు. ప్రపంచపర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం వైశ్య భవన్‌లో గన్నీ బ్యాగులను ప్రదర్శించారు. పర్యావరణ దినోత్సవ బ్యానర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలుచని ప్లాస్టిక్ సంచులు పీడనం, ఉష్ణోగ్రతల వద్ద చిరిగిపోయి సూక్ష్మ కణాలుగా గాలిలో వెదజల్లబడి భూతాపాన్ని పెంచుతాయన్నారు. కలుషితమైన ఆ గాలిని పీల్చడంతో శ్వాస కోశ, నాడీ మండల వ్యాధులు వస్తాయన్నారు. ప్లాస్టిక్ కణాలు గాలి నుంచి భూమిని చేరి పొలాల్లోని జీవసారాన్ని నశింపజేస్తాయని, పంట దిగుబడులను తగ్గిస్తాయని అన్నారు. కలుషిత నీటిని తాగి సున్నితమైన జీవజాతులు అంతరించి పోతాయన్నారు. సంస్థ సహాధ్యక్షుడు పెద్ది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అతిథులకు శుభకార్యాల్లో గన్నీ బ్యాగులు బహుమతిగా ఇవ్వాలన్నారు. వైశ్యసేవా కేంద్రం అధ్యక్షుడు చిదురసురేశ్ పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కన్న కృష్ణ, సామ నారాయణ, పెద్ది రామన్న, కొమురవెల్లి వేంకటేశం, నలుమాచు సుదర్శనం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ ఫైనల్స్‌కు ఉమ్మడి జిల్లా జట్టు



ఫైనల్స్‌కు చేరిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర హ్యాండ్‌బాల్ జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. నల్గొండజిల్లా నకిరేకల్ మండలం మంగళంపల్లిలో కొనసాగుతున్న ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు పలు జట్లపై విజయం సాధించింది సెమీ ఫైనల్‌కు చేరింది. గురువారం సాయంత్రం నిర్వహించిన సెమీ ఫైనల్స్‌లో నల్గొండపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరిందని జిల్లా జట్టు కోచ్ మూల వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా జట్టును ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేణి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి ఎన్ ప్రభాకర్ తదితరులు అభినందించారు.

గోశాలలో అనార్యోగంతో ఉన్న రెండు కోడెల మృత్యువాత

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి

సిరిసిల్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్‌లోని గోశాలలో అనారోగ్యంతో ఉన్న రెండు కోడెలు మృత్యువాత పడ్డాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోశాలలో అనారోగ్యంతో ఉన్న కోడెలకు వెటరర్నీ వైద్యులు చికిత్సలకు అందిస్తున్నారని, కొత్తగా కోడెలు అనారోగ్యానికి గురికాలేదని తెలిపారు. గోశాలలో ఉన్న 1300 కోడెలలో ప్రసుత్తం 12 మాత్రమే అనారోగ్యంతో బాధపడుతున్నాయని తెలిపారు.





ఆర్వోబీ వద్ద కొనసాగుతున్న పనులు, పాత గేటు పక్కనే ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు

చురుగ్గా ఆర్వోబీ పనులు

- కొత్తగా డైవర్షన్ రోడ్డు ఏర్పాటు
- కేంద్ర మంత్రి బండి ఆదేశాలతో పనుల్లో కదలిక

కరీంనగర్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఎట్టకేలకు పురోగతి కనిపిస్తోంది. కరీంనగర్-తీగలగుట్టపల్లి రహదారిలో రైళ్ల రాకపోకలతో వాహనదారులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా రైల్వే శాఖ మూడేళ్ల క్రితం ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. దాదాపు రూ.150 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన పనులు ఏడాదిలోగా పూర్తవుతాయని అధికారులు ప్రకటించారు. మొదట్లో కొంత వేగంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కొద్ది రోజుల తర్వాత పూర్తిగా నిలిపివేశారు. దీంతో రహదారి గుండా వెళ్లే వాహనదారులు నిత్యం అవస్థలు పడ్డారు. అర కిలో మీటర్ వరకు చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులతో ఆ ప్రాంతం అంతా గుంతలమయంగా మారింది. వాహన దారులతోపాటు పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వే అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలు మార్లు ఫిర్యాదులు చేశారు. దీంతో స్థానిక ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరు మాసాలుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతోపాటు అమృత్ భారత్ నిధులతో రైల్వే స్టేషన్ పనులపై దృష్టి సారించారు. పలు మార్లు సంబంధిత కాంట్రాక్టర్‌లతో పాటు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులకు పనులపై ఫిర్యాదు చేశారు. దీంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్టేషన్‌తో పాటు ఆర్వోబీ నిర్మాణ పనులను పరిశీలించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.



గేటు పడడంతో ఆగిన వాహనాలు

రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగిస్తూ త్వరలోనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఇందులో భాగంగా పనుల్లో వేగం పెంచారు. పాత రైల్వే గేటు పైనుంచి ఓవర్ బ్రిడ్జి పనులు సాగనున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా డైవర్షన్ రోడ్డుతోపాటు రైల్వే గేటును ఏర్పాటు చేశారు. ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చురుగ్గా సాగేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఎట్టకేలకు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు చురుగ్గా చేపడుతుండడంపై వాహనదారులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పనులు మధ్యలో నిలిపి వేయకుండా పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



రవికుమార్(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామ శివారులో గురువారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని ఇసుక ట్రాక్టర్ ఢీ కొనడంతో బండలింగాపూర్‌కు చెందిన గుగ్గిళ్ల రవి కుమార్(18) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బండలింగాపూర్ గ్రామానికి చెందిన గుగ్గిళ్ల రవికుమార్ ఆరోగ్య పరీక్షల నిమిత్తం మెట్‌పల్లి ఆసుపత్రికి వచ్చాడు. రాత్రి తిరిగి బండలింగాపూర్‌కు వెళ్తుండగా వెల్లుల్ల గ్రామ శివారులో ఎదురుగా ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రవికుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రవికుమార్ మృతి చెందినట్లు తండ్రి గుగ్గిళ్ల రాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



తిప్పాపూర్ గోశాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న కోడెల మృతి కలిచివేసింది

- విశాలమైన ప్రదేశంలో గోశాల నిర్మాణం చేపడతాం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలకు చెందిన కోడెల మృతి తనని ఎంతగానో కలిచివేసిందని ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలను ఈవో వినోద్‌రెడ్డి, వైద్యబృందంతో కలిసి పరిశీలించి కోడెల ఆరోగ్య వివరాలు వైద్య అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కొన్ని కోడెలు అనారోగ్యంతో మరణించడం చాలా బాధాకరమని, ప్రభుత్వం తరుపున సీఎం రేవంత్‌రెడ్డి కోడెల మరణాల విషయంలో వాకబ్ చేసి రాష్ట్ర స్థాయి అధికారులను పంపించారని తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్, ఆలయ ఈవో, సిబ్బందితో పాటు అన్నివిభాగాల అధికారులు కోడెలను నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధులు, అనారోగ్యంతోపాటు కొన్ని కోడెలకు లంపిస్కిన్ వ్యాధివచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారన్నారు. 16మంది వైద్యసిబ్బంది కోడెలను పర్యవేక్షిస్తున్నారని అన్నారు. దాదాపు 18నుంచి 20కోడెలు అనారోగ్యం నుంచి కోలుకుని ఆర్యోగంగా ఉన్నట్లు తెలిపారు. వేములవాడలో విశాలమైన గోశాలను నిర్మాణం చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పంచారని అన్నారు. కోడెమొక్కు భక్తుల విశ్వాసానికి నమ్మకానికి ప్రతీక అని రాజన్న ఆలయ కోడెలపై రాజకీయం చేయడం మానుకోవాలని సూచించారు. మొదటి దశలో సుమారుగా ఒక వెయ్యి కోడెలను రైతులకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. భక్తులు సమర్పించే కోడెలలో కొన్నింటికి లంపీ స్కిన్ వ్యాధి ఉండటంతో ఇతర కోడెలకువ్యాపించినట్లు అధికారులు తెలిపారని వివరించారు.భక్తులు సమర్పించే కోడెలను పదిరోజులపాటు క్వారంటైన్‌లో పెట్టి తరవాత మిగతా వాటితో కలిపే విధంగా చూడాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో వినోద్‌రెడ్డి, పశువైద్యాధికారులు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

గోశాలను సందర్శించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

తిప్పాపూర్ గోశాలలోని కోడెలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వాటికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ ఆదేశించారు.

తిప్పాపూర్‌లోని గోశాలను గురువారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాల ఆవరణలో పారిశుధ్య పనుల కోసం అదనంగా వర్కర్లను నియమించేందుకు ఉద్యోగ ప్రకటన జారీ చేశామని, కోడెల సంరక్షణకు పకడ్బందీగా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోడెలకు అందిస్తున్న వైద్య చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గోశాలలో నిర్వహణ స్వయంగా పరిశీలించారు. కోడెలకు మెరుగైన దాణా, పచ్చిగడ్డి, తాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఈవో వినోద్‌రెడ్డి, పశువైద్యబృందం, విశ్వహిందూ పరిషత్ సభ్యులు రాధా కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నగరంలో పచ్చదనాన్ని పెంచాలి


మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌ను గ్రీన్ సిటీ మార్చేందుకు, పర్యావరణాన్ని కాపాడేందుకు పచ్చదనాన్ని పెంచాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల ప్రణాళిక, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం నరంలోని పద్మనగర్ మానేరు పరివాహక సమీపంలో నగరపాలక సంస్థ, మెప్మా సమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్ నగరాన్ని గ్రీన్ సిటీ మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: నగునూర్ తెలంగాణ సాంఘీక సంక్షేవ మహిళా డిగ్రీ గురుకులంలో విద్యార్థినులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాలతి పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: కరీంనగర్ ఐఎంఏ, కాగ్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, కార్యదర్శి డాక్టర్ నవీన్‌కుమార్, కోశాధికారి డాక్టర్ విజయ్‌కుమార్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు, డాక్టర్ విజయ్‌మోహన్ రెడ్డి, డాక్టర్లు అలీం, లక్ష్మణ్, అరుణ్‌కరారి, సునీల్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

భగత్‌నగర్:కరీంనగర్ ఆర్టీసీ జోనల్ ఆసుపత్రిని శుభ్రం చేశారు.

కరీంనగర్ స్పోర్ట్స్: ప్రభుత్వ ఎస్సారార్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు.

గణేశ్‌నగర్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మహిళా కళాశాల (అటానమస్)లో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్.డి. వరలక్ష్మి కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

● శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వం ఆర్ట్స్ సైన్స్ కళాశాల ఆటానమస్ వృక్షశాస్త్ర విభాగం,జంతు శాస్త్ర విభాగం, జాతీయ సేవా పథకం ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాల అటానమస్, కాకతీయ ప్రభుత్వ కళాశాల అటానమస్ హనుమకొండ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రంగసాయిపేట వరంగల్ సహకారంతో ఒకరోజు జాతీయ ఆన్లైన్ సెమినార్ నిర్వహించారు.

హుజూరాబాద్:హుజూరాబాద్ పరిధిలోని ఇప్పల్ నర్సింగాపూర్‌లో మున్సిపల్ ఆధ్వర్యంలోమున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మహిళాసమాఖ్యల సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఏఈ సాంబ రాజు, అసిస్టెంట్ ఇంజనీర్ సుధాకర్, రషీద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జమ్మికుంట: వనమహోత్సవంలో భాగంగా పాత మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీచౌరస్తా వరకు భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆబాది జమ్మికుంటలో మొక్కలు నాటారు. మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి, ఏఈలు నరేష్, వికాస్ పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: ప్రతీ ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్ అన్నారు. గురువారం ప్రకృతి పర్యావరణంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలి

కరీంనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆధునిక కాలంలో కంప్యూటర్ వినియోగం అత్యవసరమైందని, విద్యార్థులు కంప్యూటర్‌పై పట్టు పెంచుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్‌లోని చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఫొటోషాప్‌పై నిర్వహించిన సమ్మర్ క్యాంపు శిక్షణ తరగతులు ముగిశాయి. శిక్షణ పొందిన విద్యార్థులకు గురువారం జిల్లా కలెక్టర్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫోన్‌కు దూరం ఉండి పుస్తకాలను దగ్గరగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా విద్యా నియంత్రణ అధికారి అశోక్ రెడ్డి, ప్రాంతీయ శిక్షణ కేంద్రం మేనేజర్ వెంకట రాంబాబు, ప్రోగ్రాం ట్రైనర్ సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాలను పరిశీలించిన ఏసీపీ

కరీంనగర్ క్రైం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బక్రీద్ సందర్భంగా కరీంనగర్ రూరల్ సర్కిల్‌లోని బొమ్మకల్ పరిధిలో రాజీవ్‌చమాన్, విజయ్‌నగర్ కాలనీ, సాలెహ్‌నగర్, చింతకుంట ఈద్గాలను కరీంనగర్ రూరల్ ఏసీపీ (ఐపీఎస్) శుభం ప్రకాశ్, రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. కరీంనగర్ రూరల్ మండలం, కొత్తపల్లి మండల పరిధిలో పశువధశాలలను పరిశీలించారు.

అసిస్టెంట్ ఎగ్జామినర్‌ను కలిసిన నాయకులు

కరీంనగర్ టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌రావును గురువారం టీఎన్‌జీవో, స్టేట్ ఆడిట్ ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్టేట్ ఆడిట్ డిప్యూటీడైరెక్టర్ రాజ్‌కుమార్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మెన్ దారం శ్రీనివాస్‌రెడ్డి శ్రీనివాస్‌రావును సన్మానించారు. స్టేట్ ఆడిట్ నాయకులు విజయేంద్రారెడ్డి, సురేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటేశంను కూడా సన్మానించారు. టీఎన్‌జీవో పట్టణ అధ్యక్షుడు రాజేశ్‌భరద్వాజ్, రాజేశ్వరరావు, స్టేట్ ఆడిట్ నాయకులు ఉద్యోగులు కిషన్, సుజావుద్దీన్, పవన్, మానస, బాలగంగాధర తిలక్, వంశీ, చిరంజీవి, ఫయాజ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన స్కౌట్స్, గైడ్స్ అసోసియేషన్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీరాం మొండయ్యను గురువారం జిల్లా స్కౌట్స్, గైడ్స్ అసోసియేషన్ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల సికింద్రాబాద్‌లో శిక్షణను పూర్తి చేసుకున్న స్కౌట్ మాస్టర్లు జె.ఆదిత్య, జి.చరణ్, సమర్థ్, లక్ష్మీ గణేశ్, రాంకిరణ్, మూనా, రాజు, అంజన్ కుమార్, గైడ్ కెప్టెన్లు అరుణాదేవి, భానురేఖ, అఖిల, శిరీషలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జిల్లా కార్యదర్శి కంకణాల రాంరెడ్డి, జిల్లా శిక్షణ కమిషనర్ షరీఫ్ అహ్మద్, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్లు పాల్గొన్నారు.

పశువైద్య పాలిటెక్నిక్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విద్యాలయం పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ పశుసంవర్థక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. రాష్ట్రంలోని కరీంనగర్, సిద్దిపేట, మహబూబ్‌నగర్ పశువైద్య కళాశాలల్లో వివిధ కోర్సుల్లో 99 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, టీజీపాలిసెట్-2025లో ఎంబైపీసీలో ర్యాంకు పొందినవారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు tsvu.edu.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలని,ఈ నెల 24న సాయంత్రం 5 గంటలలోపు విశ్వవిద్యాలయంలో సమర్పించాలని సూచించారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో..

కరీంనగర్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధిశాఖ అధికారి తెలిపారు. 3వ తరగతిలో మూడు సీట్లు, 5వ తరగతిలో రెండు సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 9 నుంచి 17న సాయంత్రం 5 గంటల లోపు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాయలంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయం, 9652118867 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నగునూర్ గురుకుల డిగ్రీ కళాశాలలో..

కరీంనగర్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘీక సంక్షేమ డిగ్రీ గురుకుల కళాశాలలో 2025 ప్రథమ సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.మాలతి గురువారం తెలిపారు. 2025లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 23 వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వివరాలకు 7995010675 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్తంగా..

గణేశ్‌నగర్: హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ప్లాస్టిక్ సంచులను నిషేదిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదంతో ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తెలిపారు.

సుభాష్‌నగర్: నగరంలోని మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నెక్సా షోరూంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి సెంటర్ హెడ్ కిరణ్, షోరూం మేనేజర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కరీంనగర్ స్పోర్ట్స్: పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మంకమ్మతోట దన్గర్‌వాడి ఉన్నత పాఠశాలల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో జూట్ బ్యాగులను పంపిణీ చేశారు.

భగత్‌నగర్: నూతనంగా ఎన్నికైన సీపీఐ జిల్లాకార్యదర్శి పంజాల శ్రీనివాస్ గురువారం కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

కరీంనగర్ టౌన్: జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాటి రాణాప్రతాప్ గురువారం డీఈవోకు వినతి పత్రం అందజేశారు.

కరీంనగర్ టౌన్: నగరంలోని కశ్మీర్‌గడ్డ హనుమాన్ ఆలయం ఆవరణలో కమ్యూనిటీ హాల్ స్లాబ్ పనులను మాజీ మేయర్ సునీల్‌రావు ప్రారంభించారు.

భగత్‌నగర్: నగరంలోని వైశ్య భవన్‌లో ప్రజ్ఞాభారతి, వైశ్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ సీజ్‌ఫైర్ అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ వ్యవహారాల, టీవీ విశ్లేషకుడు చార్టెడ్ అకౌంటెంట్ మామిడి గిరిధర్ మాట్లాడారు.

కరీంనగర్ కల్చరల్: ద్వారకానగర్‌లోని పట్టణ స్వర్ణకార సంఘం భవనంలో దర్శకుడు, మాస్క్ చైర్మన్ అనసూరి భూనాథాచారి రూపొందిస్తున్న 'కన్నీటి గాధ' షార్ట్ ఫిల్మ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నగరంలో మారుతి హాస్పిటల్ ప్రారంభం


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

సుభాష్‌నగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మారుతి హాస్పిటల్‌ను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ హనుమ మాట్లాడుతూ ఆసుపత్రిలో 24 గంటల పాటు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. అత్యవసర వైద్యసేవలతోపాటు అన్ని రకాల వైద్యసేవలు సామాన్యులకు అందుబాటులో ఉండే ఫీజులతో అందిస్తామన్నారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ స్వాతి కామినేని, చీఫ్ ఇన్‌చార్జి డాక్టర్ మేడికొండ రవికాంత్ చౌదరి పాల్గొన్నారు.

సాగు ఖర్చు తగ్గించుకోవాలి

కరీంనగర్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):సాగు ఖర్చును తగ్గించి అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఉషారాణి రైతులకు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ ఆధ్వర్యంలో రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహనతోపాటు వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని గురువారం చామనపల్లి రైతువేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

అశాస్త్రీయంగా డివిజన్ల పునర్విభజన

భగత్‌నగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ డివిజన్ల పునర్విభజన అశాస్త్రీయంగా చేపట్టారని మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కుట్ర పూరితంగా వ్యవహరించాయన్నారు. 2005లో తొమ్మిది మంది ఎంఐఎం కార్పొరేటర్లు గెలిచేలా డివిజన్ల పునర్విభజన చేసి ఎంఐఎం పార్టీకి డిప్యూటీ మేయర్ పదవి కట్టబెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. 2025లో మళ్లీ ఎంఐఎం పార్టీకి మేయర్ పీఠం కట్టబెట్టే కుట్రలో భాగమే డివిజన్ల పునర్వి భజనన్నారు. కేంద్ర మంత్రిగా బండి సంజయ్‌కుమార్ నగరాన్ని స్మార్ట్ సిటీ నిధులతో అభివృద్ధి చేశారన్నారు. మాజీడిప్యూటీ మేయర్ రమేష్, మాజీ ఎంపీపీ రమేష్, పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్, వన్, టు, రూరల్ ఏడీఈలు శ్రీనివాస్ గౌడ్, లావణ్య, రఘు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 వరకు భగత్‌నగర్ ఏరియా, ఎర్రగుట్ట, వెంకటేశ్వర కాలనీ, విఘ్నేశ్వర కాలనీ, వాసుదేవ కాలనీ, న్యూ శ్రీనగర్, కట్టరాంపూర్, ఉదయం 9గంటల నుంచి 11 వరకు డీ మార్ట్ ఏరియా, వరలక్ష్మి గార్డెన్, తులసీనగర్, హెచ్‌పీ గోదాం, రెడ్డి ఫంక్షన్ హాల్ బ్యాక్ సైడ్, శ్రీరామ్ నగర్ రోడ్ నంబర్లు 5,6,7, ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు శ్రీరామ్‌నగర్, ఆదిత్య నగర్, సాలంపూరా, కొత్త యాశ్వడ, విద్యానగర్, శాతవాహన విశ్వవిద్యాలయం, ఉదయం 9గంటల నుంచి 10:30 వరకు మహాలక్ష్మీనగర్, శ్రీనివాస్ నగర్, జయశంకర్ కాలనీ, శాతవాహన ఫార్మా మెడికల్ కాలేజ్, చర్చ్ ఏరియా, తిరుమలనగర్, కట్టరాంపూర్ మెయిన్‌రోడ్, బ్లూ బెల్ స్కూల్. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొత్తపెల్లి (హెచ్) ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 15 మంది గైర్హాజరు

కరీంనగర్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో గురువారం 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెండు కేంద్రాల్లో 52 మంది విద్యార్థులకు 37మంది హాజరయ్యారు. ప్రత్యేక తనిఖీ బృందం ఒక కేంద్రాన్ని, ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ ఒక పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారని డీఈవో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

భగత్‌నగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో రెండు నాన్ టీచింగ్ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కొత్తపల్లి ఎంఈవో ఆనందం ప్రకటనలో తెలిపారు. హెడ్ కుక్ ఒక పోస్టుకు మహిళా అభ్యర్థి, పదో తరగతి, అసిస్టెంట్ కుక్‌కు ఏడో తరగతి అర్హత ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీ లోగా కొత్తపల్లి ఎమ్మార్సీలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

మోదీ సంకల్ప కార్యక్రమాలను విజయవంతంచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అభయ్‌పాటిల్

భగత్‌నగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మోదీసాకార సంకల్ప కార్యక్రమాలను విజయవంతం చేయాలని కర్నాటక బీజేపీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పాటిల్ అన్నారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా అమ్మపేరుతో ఒక మొక్కను నాటాలన్నారు. మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తిచేసుకుందని, సంకల్ప సాకార పేరిట చేపట్టాల్సిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలని అన్నారు. మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే భారత్ 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. ఆపరేషన్ సిందూర్ చారిత్మాత్మక విజయమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మూగ జయ, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీమేయర్ సునీల్‌రావు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కోమల ఆంజనేయులు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిలపు రమేష్, ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లిప్రవీణ్‌రావు, కన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన


బొంతుపల్లిలో పూజల్లో పాల్గొన్న వొడితెల ప్రణవ్

వీణవంక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతుపల్లి గ్రామంలో భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి, పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. గ్రామస్థులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమనికి హుజురాబాద్ నియోజికవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు హాజరై ప్రత్యేకపూజలు చేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

హుజూరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్‌హాల్‌లో గురువారం ముస్లిం వెల్ఫేర్ ఖిద్మత్ సొసైటీ ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్, జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌లో ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానించారు. టౌన్ సీఐ కరుణాకర్, ఎస్ఐ యూనస్‌అలీ, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఎంఈవో శ్రీనివాస్, అబ్దుల్ గఫార్, హఫీజ్ అబ్దుల్ సాహీం, తదితరులు పాల్గొన్నారు.

మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

శంకరపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాపూర్ గ్రామంలో రజకుల కులదైవం మడేలేశ్వరస్వామి విగ్రహప్రతిష్ఠ గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం గ్రామంలోని రజకసంఘం నాయకులు, వివిధ కులసంఘాల పెద్దలు, రజక సంఘం నాయకులు పూజలు చేశారు.

కంటి శస్త్ర చికిత్సలకు తరలింపు

హుజూరాబాద్‌రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయాగ్రామాల్లో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరాల్లో కంటి శస్త్రచికిత్సలకై గుర్తించిన వారిని గురువారం ప్రత్యేకబస్సులో హైదరాబాద్‌కు తరలించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గుడిపాటి సరితజయపాల్‌రెడ్డి తెలిపారు. మొదటి వైద్యశిబిరంలో భాగంగా 3వేల మందికి పరీక్షలు నిర్వహించి 500ల మందికి పైగా ఆపరేషన్లు చేశామని, ప్రస్తుతం 175మందికి కంటి శస్త్రచికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రైతు భరోసా నిధులు వెంటనే జమ చేయాలి

ఇల్లందకుంట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు రైతు భరోసా నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా సహాయకార్యదర్శి చెల్పూరిరాము అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ముందస్తు వర్షాలు పడడంతో వానాకాలం పంటలు వేదయం ప్రారంభమైందన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి

కరీంనగర్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో రవీందర్ అన్నారు. గురువారం కరంనగర్ మండలం పరిషత్ కార్యాలయంలో మండలంలో పని చేస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఐసీడీఎస్ శాఖ సూపర్ వైజర్‌లకు ఎంపీడీవో సంజీవరావు అధ్యక్షతన, ఎంఈవో రవీందర్ పర్యవేక్షణలో బడిబాట ప్రణాళిక సమావేశం నిర్వహించారు. బడిబాట శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు చెప్పారు.

రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్


శ్రీరాములపల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

రామడుగు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపుకలెక్టర్ లక్ష్మీకిరణ్ అన్నారు. రామడుగు మండలం శ్రీరాములపల్లిలో నిర్వహించిన రైతు సదస్సులో మాట్లాడారు. భూ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ రాజేశ్వరి, డీటీ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలో మూడోరోజు ఇందుర్తిలో నిర్వహించిన భూభారతిరెవెన్యూ సదస్సులో 277దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ముద్దసాని రమేష్ తెలిపారు. మిగితాకొన్ని దరఖాస్తులను అక్క డే పరిష్కరించినట్లు ఆయన తెలిపారు.

ఇల్లందకుంట: మండలంలోని బూజూనూర్‌లో తహసీల్దార్ రాణి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 118 దరఖాస్తులను స్వీకరించామని ఆర్డీవో రమేష్ బాబు

వీణవంక: చల్లూరులో 211 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ రజిత తెలిపారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాకలో 52 మంది దరఖాస్తులను సమర్పిం చగా ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ కనకయ్య పరిశీలించారు.

భగత్‌నగర్: భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం కొత్తపల్లి మండలంలోని ఎలగందల్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. గత ప్రభుత్వ ధరణితో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సమస్యలకు పరిష్కారం చూపాలనే ఉద్దే శంతో భూభారతి తీసుకొచ్చిందని అన్నారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహ సీల్దార్ సుమలత, ఆర్ఐలు రజనీకుమార్, నదీం పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ప్రణాళికతో హుజూరాబాద్ పట్టణాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. గురువారం హుజూరా బాద్ పట్టణంలోని బుడగజంగాల కాలనీని ఆయన సందర్శించారు. కాలనీసమస్యలపై గతంలో కాలనీవాసులు వినతులు ఇవ్వగా ఒక్కొక్క టిగా పరిష్కారానికి చొరవచూపిస్తున్న ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో గురువారం హుజురాబాద్ నియోజికవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ పేదలకు న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమం లో మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, వెంకటస్వామి, సాహెబ్ హుస్సేన్, మధుకర్ రెడ్డి, సతీష్ తదితరులు న్నారు.


వీణవంక: మామిడాలపల్లిలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందిస్తున్న వొడితెల ప్రణవ్

ఘనంగా ఎమ్మెల్యే సత్యం జన్మదిన వేడుకలు


చొప్పదండిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షులు కొరివి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక మంచిర్యాల చౌరస్తాలో గురువారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేసి మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెన్న రాజ మల్లయ్య, ఎస్సీ సెల్ కన్వీనర్లు జీడి రమేష్, జుంజుపల్లి వివేక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండిఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలను మండలాల్లో ఘనంగా నిర్వహించారు. చొప్పదండిలో మండలకాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్‌కట్‌చేసి 38మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీమున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్, జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, పురం రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: గ్రామాల్లోకాంగ్రెస్ నాయకులు కేక్‌కట్‌చేసి స్వీట్లుపంపణీచేశారు. వెలిచాలలోని వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. గంగాధర మండలానికి చెందిన లక్ష్మీదేవిపల్లి గ్రామస్థులు వెలిచాలలోని ప్రశాంత్‌భవన్‌లో చిన్నారులకు పండ్లు పంపిణీచేశారు. ఆయా కార్యక్రమాల్లో మండలకాంగ్రెస్ అధ్యక్షుడు జవ్వాజిహరీశ్, సీనియర్ నాయకులు ఉప్పుల అంజనీప్రసాద్, కోలరమేష్,బొమ్మరవేణి తిరుపతి, పాల్గొన్నారు.

గంగాధర: గంగాధరలో మార్కెట్‌కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మనోహర్, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్ కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్లను పంపిణీ చేశారు. గ్రామాల్లో సైతం పెద్ద ఎత్తున కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

అవీ.. ఇవీ..

చిగురుమామిడి: మండలంలోని అన్ని గ్రామాల్లో మండల అభివృద్ధి అధికారి అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసంపథకాలు కేటాయించారని గురువారం జిల్లా కలెక్టర్ పమేలాసత్పతికి సీపీఐ మండల కార్యదర్శి, సహాయకార్యదర్శి బూడిద సదాశివ పిర్యాదు చేశారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు, అధికారులు కుమ్మక్కై నిర్ణయించారని ఆరోపించారు.

గంగాధర: ఉపాధిహామీలో చేపడుతున్న అభివృద్ధిపనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో రాము అన్నారు. గురువారం ఎంపీడీవో సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఎంపీవో గౌరిరమేష్ ఉన్నారు.

చొప్పదండి: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సీఐ ప్రదీప్‌కుమార్ అన్నారు. గురువారం చొప్పదండిలో అమృత్‌మిత్ర స్వచ్ఛత ర్యాలీలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. మున్సి పల్‌కమిషనర్ నాగరాజు, మేనేజర్ ప్రశాంత్, ఏఈ రాజేశం పాల్గొన్నారు.

చొప్పదండి: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో వేణుగోపాల్‌రావు అన్నారు. గురువారం చొప్పదండిలో బడిబాట సన్నాహక సమావేశానికి హాజరై మాట్లాడారు. బడిబాటలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న బోధన గురించి వివరించాలని తెలిపారు. ఎంఈవో మోహన్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా జమ్మికుంట రూరల్‌సీఐ కిశోర్, ట్రైనీ ఎస్ఐ దీపక్ కుమార్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను ట్రేస్‌చేసి బాధితులకు అప్పగించారు. దీంతో బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సుభాష్‌నగర్: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలను ప్రతీ గ్రామంలో నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంద రాజు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ పిలుపు నిచ్చారు. గురువారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామంలో జెండా గద్దెల నిర్మాణాలు చేపట్టాలని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని అన్నారు.